# పూలమ్మి

తలుపు మీద చిన్నగా తట్టిన చప్పుడైంది. భక్తి టి.వి.లో ఆధ్యాత్మిక కార్యక్రమం చూస్తున్న నేను తలెత్తి గడియారం వైపు చూశాను. సమయం సాయంత్రం ఆరున్నర. ఈ వేళలో వచ్చేది పూలమ్మి నాగమ్మే. సమయ పాలన గురించి ఆమె దగ్గర పాఠాలు నేర్చుకోవచ్చు.

వాకిలి తెరవగానే నాసికా పుటల్ని సోకిన పూల సువాసన మనసు నిండా ఆహ్లాదం నింపింది. తెల్లని పూలదండని మూరతో కొలుస్తున్న నల్లని నాగమ్మ ముఖంలో చల్లని చిరునవ్వు.

వయసు భారంతో వంగిపోయిన నడుము. పూలగంప బరువు మోయలేని శరీరం. చేతికర్ర సాయంతో అడుగులో అడుగు వేస్తూ నడిచే నాగమ్మ ముఖంలో చిరునవ్వు మాత్రం చెదరదు.

పండిపోయిన జుత్తు, ఎండిన శరీరం, నలిగి మాసిపోయిన చీరె, నరాలు తేలిన చేతులు... ఇదీ నాగమ్మ ఆకారం.

"ఈ వయసులోనూ కష్టం చేసుకుని బ్రతకాలా నాగమ్మా? పిల్లోళ్లు సాకరా?" అని ఒక రోజు అడిగాను.

"ఈ రెక్కలకష్టంతో నన్ను బతకమని దేవుడు రాసినాడమ్మా. నలుగురు పిల్లోళ్లని కని సాకినాను. పెద్దోడు నాలుగు బర్రెలు పెట్టుకుని పాలయాపారం చేస్తాండాడు. రెండోవాడు టీకొట్టు పెట్టుకున్నాడు. చిన్నోళ్లిద్దరూ మట్టి పనికి పోతరు. ఆళ్ల నాయన సంపాదనంతా తాగుడికీ తగలపెడుతాండె. ఆ పనీ ఈ పనీ చేసి నలుగుర్నీ నేను సాకినాను. నలుగురికీ పెండ్లిండ్లు చేసినా. అందరికీ బిడ్డలయుండారు. వాండ్లు నలుగురు కలిసి నాకు ముద్ద పెట్టలేరంట" అంది నిర్వేదంగా.

నాగమ్మ అందించిన పూలు తీసుకుంటున్నప్పుడు గమనించాను. ఆమె కట్టుకున్న చీరె గుండెలమీదే చినిగిపోయి వుంది. నాగమ్మ ఎవరినీ నోరు విడిచి ఇది కావాలని అడగదు. "ఒక్క నిమిషముండు నాగమ్మా' అంటూ లోపలికి వెళ్లి నేను ఇంట్లో కట్టే చీర తీసుకువచ్చాను. "అత్తయ్య చూస్తే నువ్వు వాడుకునేది ఇవ్వాలా? పనికి రాదని పక్కకు పెట్టింది ఇస్తే చాలదా?" అని గొణిగేది. అమ్మ అయితే "చిన్నప్పటి నుండీ అంతే... నీది జాలిగుండె" అనేది... అనుకుంటూ చీరె నాగమ్మ కిచ్చాను. నవ్వు ముఖంతో తీసుకొంది. " పొయ్యొస్తానమ్మా" అంటూ నెమ్మదిగా కదిలింది.

మర్నాడు సాయంత్రం నాగమ్మ మళ్లీ అదే చిరుగుల చీరె కట్టుకుని వచ్చింది. 'బాగానే వుంది. తను అడగకపోయినా వాడుకగా పూలు కొనే ఇల్లాళ్లు జాలిపడి ఇస్తారని ఈ పద్ధతి ఎంచుకుందా' అనుకుంటూ మాట్లాడకుండా పూలు తీసుకొని తలుపు వేసుకున్నాను.

మర్నాడు ముక్కోటి ఏకాదశి. హౌసింగు బోర్డునుండి పార్థసారథి గుడి పెద్ద దూరం లేకపోయినా కార్లోనే బయల్దేరా. బి.క్యాంపు మలుపు దగ్గర బాగా వేగం తగ్గించాడు డ్రైవరు. సరిగ్గా అక్కడే రొడ్డుమీదకి కూర్చుని వుంటుంది ఒక గుడ్డి ముసల్ది. ఆ దారిన వెళ్లేవాళ్లు ఆమెని దాటి వెళ్లాలి గనుక కొందరైనా ముసల్దాని ముందున్న బొచ్చెలో చిల్లర వేసిపోతారు.

విసుగ్గా అటు చూశాను. నా దృష్టి అమె కట్టుకున్న చీరె మీద పడింది. నిన్న నాగమ్మకు ఎంతో ఉదారంగా నేను ఇచ్చిన చీరె. "ఎంత పొగరు? తను కట్టుకున్న చినిగిన చీరెకన్నా తీసిపోయిందా?" అనుకుంటే ఒళ్లు మండింది.

ఆరోజు సాయంత్రం నాగమ్మను నిలదీశాను. 'నేనిచ్చిన చీరె అంత పనికి రానిదయిందా నాగమ్మా? ముష్టిదానికిచ్చేశావు?" అని.

"అంతమాట అనొద్దమ్మా, నిన్న రాతిరి ఇంటికి పోతుంటే చలికి గజగజ వణుకుతూ ఒంటిమీద సరైన గుడ్డకూడా లేకుండా అంగడి ముందు ముడుచుకుని పండుకుందమ్మా ఆయమ్మ. నాకు వుండేందుకు గుడిసె వుంది. ఆయమ్మకదీ లేదు. చలికి చచ్చిపోతుందేమోనని నాకిచ్చిన చీరె ఇచ్చేసి నానమ్మా" అంది నాగమ్మ. నాకు నోట మాట రాలేదు.

ఆరోజు నాగమ్మ తెచ్చిన పూలెందుకో మరీ గుబాళిస్తున్నాయి.

**- మినీ కథాసంకలనం డిసెంబరు 2009**